క్లుప్తంగా

రహదారి పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సోనియా

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామం నుంచి పాగిరి వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులను సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత ఆదివారం ప్రారంభించారు. ప్రజలు సహకరిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పున్నాన అక్కునాయుడు, మక్క శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ



సంఘ ప్రతినిధులతో కలిసి క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర డైరీలు, వాల్, స్టిక్కర్, పాకెట్ క్యాలెండర్లను శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరించారు. ఆదివారం ఎంపీని క్యాంపు కార్యాలయంలో కలిసిన రాష్ట్ర, జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ, దళిత సంఘ నాయకులు ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయ, ఉద్యోగులు పాత్రే కీలకమని చెప్పారు. విలువలతో కూడిన విద్యను పాఠశాలల్లో అందించాలని సూచించారు. ఎంపీని కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పోతల దుర్గారావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొంతా సుబ్బారాయుడు, కొప్పల డేనియల్, అన్ను వెంకటరావు, శైల రమేష్‌బాబు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవల అప్పన్న, కింజరాపు నూకరాజు, ఉద్యోగ సంఘ నాయకులు నూతలపాటి భరత్‌భూషణ్ రాజు, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అంపోలు ప్రతాప్, కోశాధికారి బసవల చిన్నారావు, సవలాపురపు వెంకటరమణ ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం 2024 వార్షిక డైరీని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన శ్రీకాకుళం జిల్లా సంఘ సభ్యులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జేసీ మల్లారపు నవీన్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు సోమసుందరరావు, పి.సూర్యప్రసాదరావు, పి.నరసింహమూర్తి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

మేమున్నామని..

● స్నేహితులకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

హిరమండలం: తోటివారు కష్టాల్లో ఉన్నప్పుడు సాయపడడం ప్రాథమిక కర్తవ్యం. అటువంటి సంకల్పాన్ని, తెగువను చూపిస్తున్నారు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 1991 నుంచి 1996 మధ్య 6 నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 2018లో రాక్‌బ్యాచ్ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమతో చదువుకున్నవారు కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలవాలని బలంగా సంకల్పించారు. సొంతంగా నిధులు పోగు చేసుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల సంఘంలో ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారు ఉన్నారు. ఎవరి స్థాయికి తగినంత వారు విరాళాలు అందిస్తున్నారు. పాఠశాలలో బీరువాలు, ఫర్నీచర్‌కు రూ.లక్ష వరకు సాయమందించారు. గొర్లె జగదీష్ అనారోగ్యానికి గురికావడంతో 2018లోనే రూ.20 వేల నగదు అందించారు. అప్పటి నుంచి ప్రతి నెలా మందుల కోసం రూ.3 వేల వంతున సాయం అందిస్తున్నారు. కళింగపట్నం గురునాథం క్యాన్సర్‌తో బాధపడుతుండగా.. ఆయనకు రూ.36 వేలు అందించారు. ఇటీవల ఆయన పరిస్థితి విషమంగా మారడంతో ఆదివారం వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలు అందజేశారు. క్యాన్సర్ బారినపడిన బెవర సాయికి వైద్య ఖర్చులకు రూ.60,700లను అందించారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. తోటివారికి సాయం చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

చంద్రబాబును నమ్మకండి

● మంచిచేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి
● ఆసరా సంబరాల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు



గార: మహిళా సంఘ ప్రతినిధులకు చెక్‌ను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: వప్పంగిలో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

గార: చంద్రబాబును ఎవరూ నమ్మవద్దని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మంచిచేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. పేదలకు పథకాలు పేరిట డబ్బులను పంచడం తప్పు అన్న చంద్రబాబును నమ్మితే సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయన్నారు. ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని నాలుగు సచివాలయాల పరిధిలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డ్వాక్రా, రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి గతంలో గద్దెనెక్కిన చంద్రబాబు తరువాత వారిని మోసం చేసిన సంగతి మర్చిపోలేమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణాలను నాలుగు విడతల్లో పూర్తిగా చెల్లించామని.. ఈ విషయాన్ని చెప్పడానికే ఈ సమావేశం నిర్వహించామన్నారు. మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామస్థాయిలోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు జరిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, ఇంటికే వచ్చి వైద్యాన్ని అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటికే వలంటీరు వచ్చి మూడు వేల రూపాయలను పింఛన్ అందజేస్తున్నారన్నారు. మాయ మాటలు చెప్పేందుకు టీడీపీ నాయకులు త్వరలోనే వచ్చి ప్రతి ఇంటికీ మూడు సిలిండర్లు అంటారని దీనిపై ఆశపడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు రోజు కూడా డబ్బులిచ్చేందుకు వస్తారని.. వాటిని తీసుకొని మీకు న్యాయం చేసేవారికే ఓటు వేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకుందని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, అందవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, సర్పంచ్ గోరు అనిత, ఎంపీటీసీ సభ్యులు ఊట విజయలక్ష్మి, కె.మనెమ్మ, అందవరపు రామలక్ష్మి, ఉప్పాడ ఆదిలక్ష్మి, పార్టీ కన్వీనర్ పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, శిమ్మ ధర్మరాజు, సుంకాన సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమానికి బ్రహ్మరథం పట్టాలి:మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు మహిళలంతా బ్రహ్మరథం పట్టాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. వప్పంగి, చింతాడ గ్రామాల్లో ఆదివారం జరిగిన ఆసరా ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. వప్పంగిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. వప్పంగిలోనే సంక్షేమం, అభివృద్ధి పేరిట 35 కోట్ల 24 లక్షల రూపాయలను ఖర్చు చేసినట్టు చెప్పారు. 2014లో చంద్రబాబు మోసపూరిత హామీలే మహిళలకు చూపించారని, ఈసారి సరికొత్త మాయమాటలతో ముందుకు వస్తున్నారని ఎవ్వరూ నమ్మవద్దన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వంలోనే ఇంటిల్లాపాదికి ఆర్థిక భరోసా అందించి మహిళలను మహారాణులను చేశారన్నారు. ఫిబ్రవరిలో వైఎస్సార్ చేయూత అందిస్తామన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామన్నారు. ఎల్లో మీడియా రాతలను చదివి మోసపోవద్దన్నారు. సంక్షేమ పథకాలు ఒక ఎత్తేయితే.. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ బడులు, గ్రామ సచివాలయాలు, వెలనెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు సంక్షేమ పథకాలను పంచిపెట్టేస్తున్నారు అంటున్నారే తప్పా...ఆయన తినేస్తున్నారాని ఎవరైనా అన్నారా అంటూ మంత్రి ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ ధనాన్ని జన్మభూమి కమిటీ సభ్యులకు, ఆయన కోటరీ మనుషులకు ధారాదత్తం చేశారన్నారు. నిధులను మింగేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ.. వప్పంగి ఆడపడుచూ చల్లా కల్యాణి ఐఏఎస్‌లో టాపర్‌గా నిలిచి.. జాతీయస్థాయిలో శ్రీకాకుళం జిల్లాకు, గ్రామానికి గౌరవాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, పార్టీ నాయకుడు చల్లా రవికుమార్, స్థానిక సర్పంచ్ వాణిదేవి, చిట్టి రవికుమార్, బోర చిన్నంనాయుడు, గుండ ఆదిత్య నాయుడు, బగాది మనోజ్, బోర రమణయ్య, గంగు నరేంద్రకుమార్, రుప్ప అప్పలసూరి, గేదేల శంగల్వారావు, ఎపిఎం సుజాత పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: వప్పంగిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన



శ్రీకాకుళం రూరల్: చింతాడ సభలో చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: వప్పంగి సభకు హాజరైన మహిళలు

కుట్టుమిషన్‌ను కొనుగోలు చేశాను



మా వారు లగేజ్ వాహనానికి వెళ్తారు. నాకు జగనన్న అందించిన ఆసరా నగదుతో కుట్టుమిషన్‌ను కొనుగోలు చేశాను. మహిళలకు సంబంధించిన అన్ని రకాల డ్రెస్సులను ఇంటివద్దే కుడుతాను. జగనన్న అందించిన డబ్బుతోనే నేను ఆర్థికంగా లబ్ధిపొందాను.

– ఎం.దేవిక, వప్పంగి,
అంబికా స్వయంశక్తి సంఘం సభ్యురాలు

ఇటుకల వ్యాపారం చేస్తున్నాను



నాకు ఆసరా డబ్బులు ఎంతో ఆర్థిక భరోసా చేకూర్చాయి. స్థానికంగా ఇటుకల వ్యాపారం చేస్తున్నాను. కొన్ని సందర్భాల్లో వ్యాపారం కొంచెం ఇబ్బందిగా ఉంటే జగనన్న అందించిన ఆసరా డబ్బులు కూడా ఈ వ్యాపారానికి చాలా ఉపయోగపడ్డాయి. ఖాళీ సమయాల్లో బ్యాగులు, ఇతరత్రా వస్తువులు కుడతాను.

–ఎం భవానీ, గాంధీనగర్,
పగడాలమ్మ స్వయంశక్తి సంఘం

పుస్తక పఠనంతోనే విజ్ఞానం



రణస్థలం: పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు



ఎచ్చెర్ల క్యాంపస్: బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి



కథలు చెబుతున్న లైబ్రేరియన్

రణస్థలం: విద్యార్థులకు పుస్తక పఠనంతో సంపూర్ణ జ్ఞానం కలుగుతుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా దినపత్రికలు, కథలు చదివించడం, రాయించడంతో పాటు చిత్రలేఖనం పోటీలను ఆదివారం పెట్టారు. గ్రంథాలయంలో విజ్ఞాన పొందే ఎన్నో పుస్తకాలు ఉన్నాయని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు గ్రంథాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

ధర్మవరం శాఖా గ్రంథాలయంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతీ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు వేమన, సుమతి శతకాలు గురించి తెలియజేశారు. వీటిపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. గ్రంథాలయ సహాయకులు భట్నా సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

శ్రీకాకుళం కల్చరల్: బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం జరిగింది. గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో పిల్లలకు పంచతంత్రంలో నీతి కథలు, వేమన పద్యాలు వినిపించారు. లైబ్రేరియన్ ఉగ్రసేను మాట్లాడుతూ ప్రతి ఆదివారం నిర్వహించే కార్యక్రమాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత ఉన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో 75వ గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బలగ లయన్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 26 మంది రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ.. రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్ పర్సన్ బడాన దేవభూషణరావు, బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఆమదాలవలస రూరల్: కృష్ణాపురం పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలియజేశారు. రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28వ తేదీలోగా 7 శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవచ్చునని సూచించారు. రైతులు వన్-బీ ఒరిజినల్, ఆధార్, రేషన్, పాన్‌కార్డు జిరాక్స్‌లు, మూడు పాస్ ఫొటోలు, బ్యాంకు ఖాతా జిరాక్స్ తీసుకుని కార్యాలయం పని వేళల్లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28 తరువాత 13 శాతం అపరాధ రుసుంతో రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంకటస్వామికి వాస్తురత్న పురస్కారం ప్రదానం



వెంకటస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త, జ్యోతిష్యవేత్త రోటేరియన్ మంత్రి వెంకటస్వామికి వాస్తురత్న పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో జరిగిన విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో పదో వేదిక్ ఎస్ట్రాలజీ కాన్‌క్లేవ్ సందర్భంగా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు ఎ.వేణుగోపాల్ దీక్షితులు, ఆచార్య సాగి కమలాకర్ శర్మ, ఇంద్రకంటి వెంకట గోపాలకృష్ణ శర్మ, జొన్నలగడ్డ శ్రీనివాసరావులు హాజరై వెంకటస్వామిని సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి సన్మానం



శ్రీరామ్మూర్తిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తికి దవళపేట గ్రామస్తులు ఆదివారం ఘన సత్కారం చేశారు. ఈ గ్రామంలో గత మూడేళ్లుగా పేదలు, వృద్ధులకు ప్రత్యేక సేవలు అందించారు. దీంతోపాటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు మండల పార్టీలో కీలక పదవి ఇవ్వడంతో శ్రీరామ్మూర్తి సత్కరించారు. పార్టీ కార్యకర్తలు పేడాడ శ్యామలరావు, పేడాడ స్వాతినాయుడు, కంచరాన రమణారావు, బొడ్డేపల్లి ఉదయ్ కుమార్, పేడాడ కృష్ణంరాజు, మధుసూదనరావు, రమణ, చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి



ప్రసంగిస్తున్న ఆనంద్ రాజేంద్రన్

శ్రీకాకుళం కల్చరల్: మనస్సును ఎప్పుడు ప్రశాంతంగా ఉంచుకుంటూ పనులు చేయటం వలన శత శాతం ఫలితాన్ని ఆశించవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషన్ సీనియర్ ఫ్యాకల్టీ ఆనంద్ రాజేంద్రన్ అన్నారు. ఆదివారం స్థానిక బృందావనం కల్యాణ మండపంలో నాలుగు రోజులు జరిగిన శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనందాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. ఆనందానికి, ఆహ్లాదానికి కళలు కూడా ఆధారమవుతాయన్నారు. అందుకే ప్రతిక్షణం ఆనందంగా ఉంటూ సంతోషంగా.. ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. సినియర్ గురువు శంకర నారాయణరావు మాట్లాడుతూ.. మనకు తెలియకుండా మనలో పరివర్తన తీసుకువచ్చే వారే నిజమైన గురువులన్నారు. ఇప్పుడు నిర్వహించిన డీఎస్ఎన్ శిక్షణ చాలా సమస్యలకు దారి చూపుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ టీచర్ నమ్రత, విజయలక్ష్మి, హరినారాయణ, డాక్టర్ కె.అమ్మన్నాయుడు, కొఠారి రేణుక, శారద, పద్మజ, కె.ఎస్.ఎన్.మూర్తి, డీడీసీ సభ్యులు బి.వి.రవిశంకర్, వరదా వెంకట ఆనంద్, నంబాళ్ల కల్పన, దేసూళ సురేంద్ర, ఎస్.వి.ఎ.పోలినాయుడు, వలంటీర్లు కొఠారి ఆదినారాయణ, పూడి శ్రీనివాస్ రెడ్డి, ఎల్.వి.రమణ, శంకర్ పాల్గొన్నారు.

గణేష్ గురూజీకి ఘనంగా ఆహ్వానం



గణేష్ గురూజీకి హారతులిస్తున్న మహిళలు



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైవరపీఠం దేవాలయం గణేష్ గురూజీకి బలగ గ్రామమస్తులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. అయోధ్య బాల రామ ప్రతిష్ఠ మహోత్సవానికి వెళ్లి తిరిగి వచ్చిన గురువును బలగ మెట్టు కూడలి నుంచి పీఠం వరకు మేళతాళాలతో జైజై ధ్వనులతో స్వాగతం పలికారు.

కళ్లను రక్షించుకోవాలి



నేత్ర శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కళ్లు దేవుడిచ్చిన అపురూపమైన నిధి అని, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం మనవిధి అని నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. పట్టణంలోని రైతుబజార్ వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఎల్లప్పుడూ ముందుండే హారిక ప్రసాద్ అందరికీ ఆదర్శంగా నిలిస్తున్నారన్నారు. స్థాపించిన రెండేళ్లలోనే లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ప్రజావసరాలను గుర్తించి, వాటిని అందించడంలో, పేద విద్యార్థులను ఆదుకోవడంలో, పర్యావరణ హితమైన కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్ క్లబ్ పాత్ర కీలకమైందని చెప్పారు. దినేష్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ దినేష్ కాంత్ మాట్లాడుతూ.. కంటి సమస్యను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు హారిక ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంతటి మంచి కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఫిబ్రవరి 18న బాపూజీ కళా మందిర్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు కరణం శోభారాణి, అప్పారావు, వాసు, సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని కేశవరెడ్డి పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల వెలుగు ఏపీఎం రామ్మూర్తి ఆదివారం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరవుతారన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వయం సహాయ సంఘాల లబ్ధిదారులకు కోరారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సారవకోట: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు నిర్వహించాలని నరసింహ స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో 90వ ఆధ్యాత్మిక సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు చేపట్టడంతో హిందూ ధర్మ ప్రచారం పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగితే ఈర్ష్యా, ద్వేషాలు తగ్గుతాయని, దీంతో సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. నిత్యానంద స్వామి, అల్లు రామయ్య, సోమేశ్వరరావు, వెంకటరమణ, మోహనరావు తదితరులు పలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

చిన్నారికి చేదోడుతో రక్షణ

పాతపట్నం: తల్లిదండ్రులకు దూరంగా చదువుతున్న విద్యార్థినులకు చిన్నారి చేదోడు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని మండల కో ఆర్డినేటర్ నల్లి రాజారావు అన్నారు. బొమ్మిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో చిన్నారికి చేదోడు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థినులు తింటున్న అల్పాహారాన్ని పరిశీలించారు. పాఠశాల డార్మిటరీని, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ విద్యార్థినులకు ఏ సమస్య వచ్చినా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. నీతిని గ్రహించాలని, చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి, కానిస్టేబుల్ జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.